ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 10 | జూన్ 2026


ఈ సంచికలో. . . .


ఆత్మవిద్య ఒక్కటే సత్యవిద్య ........................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 5

శ్రీమద్భగవద్గీత .................................. 23


**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-



చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

మిమ్మల్ని బాగు చేసేది భక్తి.
మీలో వివేకాన్ని, వైరాగ్యాన్ని
పెంచేది భక్తి. నీ
హృదయంలో
అంతర్యామిగా ఉన్న
భగవంతుడితో మిమ్మల్ని
అనుసంధానం
చేసేది భక్తి.

# ఆత్మవిద్య ఒక్కటే సత్యవిద్య

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)



ఆత్మవిద్య ఒకటే సత్యవిద్య. మిగతా విద్యలన్నీ దేహము మనస్సు ఎంత నిజమో, చావుపుట్టుకలు ఎంత నిజమో, దేహగతమైన నేను, ఎంత నిజమో, ఆ విద్యలు కూడా అంతే నిజం. అభౌతికమైన శాంతి, అలౌకికమైన శాంతి ఒక్క ఆత్మవిద్య వల్ల కలుగుతుంది. ఆత్మవిద్యని వేదాంత పరిభాషలో పరావిద్య, బ్రహ్మవిద్య, అంటారు. అంటే మోక్షాన్ని తీసుకొచ్చే విద్య. లోకానికి సంబంధించిన విద్యలు కూడా అవసరమే, కాని వాటివల్ల మోక్షం రాదు, గౌతమబుద్ధుడు పొందిన నిర్వాణస్థితి పొందలేరు. అది పరావిద్య వల్లే సాధ్యము అవుతుంది.

ఆత్మవిద్యని నేను అన్నాడు పరమాత్మ. అంటే ఎన్ని విద్యలు నేర్చుకున్నా, ఆత్మవిద్య లేకుండా, ఆత్మజ్ఞానం లేకుండా, ఆత్మవైభవం తెలియకుండా నీకు ఆత్మసుఖం రాదు. నిన్ను లోపలికి తీసుకుపోయేది, ఎక్కడైతే పరమేశ్వరుడు నివాసంగా ఉంటాడో, ఏ నారాయణుడు అయితే నీకు అంతర్యామిగా ఉండి సృష్టిని పరిపాలిస్తున్నాడో,

అక్కడికి తీసుకుపోయేది ఆత్మవిద్య. ఆత్మవిద్య వల్ల పరిపూర్ణమైన శాంతి పొందుతావు. లోకంలో అనేక భోగాలు, విషయాలు ఉన్నాయి, కాని వాటి వల్ల పూర్ణానందం రాదు. ఏదైతే పూర్ణవస్తువో దాని ఎరుక వచ్చినప్పుడు ఆ పూర్ణవస్తువు లోనుంచి పూర్ణానందం వస్తుంది.

ఈ లోకంలో భోగాల గురించి కాని, స్వర్గంలో భోగాల గురించి కాని, వాటి తాలూకు తలంపు ఉంటే కూడా మీకు ఆత్మజ్ఞానం కలగదు అన్నాడు భగవంతుడు గీతలో. ఆ భోగాలను అనుభవించక్కరలేదు, వాటిమీద మనస్సు వాలితే కూడా ఆత్మజ్ఞానం కలగదు, మీ మనస్సును ఇంక లోపలికి ఎవరూ తోలుకెళ్ళలేరు అని చెప్పాడు.

చాలా గొప్ప గొప్ప లోకాలు ఉన్న మాట నిజమే, ఎన్ని లోకాలకి వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా మళ్ళీ ఈ భూమి మీదకి తిరిగి రావలసిందే. ఎన్ని లోకాలకి వెళ్ళినా, ఎన్ని భోగాలు అనుభవించినా, పునర్జన్మ తప్పదు. మళ్ళీ సాధన చేసుకోవలసిందే. అక్కడ అనుభవించిన భోగాలు అన్నీ వాసనల కింద ఏర్పడతాయి, మళ్ళీ వాటిని తొలిగించుకుంటేనే కాని మీకు ఆత్మజ్ఞానం కలగదు. జ్ఞాని కానివాడికి ప్రతివాడికీ పునర్జన్మ వస్తుంది. ఎందుచేత అంటే, వాడికి పూర్ణస్థితి అందలేదు. ఎవడైతే పూర్ణానందం పొందలేదో, పరిపూర్ణ సుఖం పొందలేదో, వాడికి పునర్జన్మ వచ్చి తీరుతుంది.

ఆత్మజ్ఞానం సంపాదించాలి, మోక్షం పొందాలి అని మనం పరుగు పెడుతున్నాము. కాని మనం ఎన్ని సాధనలు చేసినా, పూర్వజన్మల నుంచి వచ్చే అలవాట్లు, తలంపులు వాసనల నుండి బయటకు రాలేకపోతున్నాము. మన అలవాట్లే మన వాసనలే మన తలంపులే మన సంకెళ్ళు. మనం ఒకవేళ అభివృద్ధి పొందుదామన్నా, వీటి యొక్క వేగం పొందనివ్వదు. రోగం తగ్గాక బలం మాట చూసుకోవచ్చు అంటారు డాక్టరులు. అసలు ఈ అలవాట్ల లోనుంచే బయటికి రాలేకపోతున్నాము, ఇంక అభివృద్ధి ఏమిటి! మనల్ని మనమే మోసం చేసుకొంటున్నాము.

మనకి బాహ్యావిషయాల మీద ఎంత ఇష్టం ఉందో అంత ఇష్టం అంతర్యామి

అయినటువంటి నారాయణుడిమీద కలిగితే మన మనస్సుకి లోచూపు కలుగుతుంది. భగవంతుడి పట్ల మనకి చలనం లేని విశ్వాసం ఉంటే దానికి ప్రతిఫలంగా ఆత్మవిద్యని మనకి ప్రసాదిస్తాడు. ఆత్మ విద్య ఒక్కటే మనకి స్వేచ్ఛని, సుఖాన్ని, స్వాతంత్ర్యాన్ని కలిగిస్తుంది. మిగతా విద్యలన్నీ పొట్టకి సంబంధించిన విద్యలు. భగవంతుడే మనలో నిజమైన ఆత్మగా ఉన్నాడు.

నువ్వు దేహం తోటి మనస్సు తోటి తాదాప్యం పొంది అదే నేను అనుకొంటున్నావు. ఈ ఆస్తి డబ్బు గౌరవం, ఇవన్నీ చుట్టబెట్టుకొని నీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటున్నావు. ఈ నేనుని విడిచిపెట్టకుండా భగవంతుడిని పొందలేవు. అంటే జీవలక్షణాలు పోకుండా నువ్వు ఆత్మని పొందలేవు. నీకు రెండూ కావాలంటే సాధ్యం కాదు. నీకు స్వరూపజ్ఞానం కావాలంటే అజ్ఞానం అవిద్య విడిచిపెట్టాలి అన్నాడు ఏసు.

ఏ వస్తువుకి అయితే జనన మరణములతో సంబంధం లేదో, ఏ వస్తువు అయితే స్వతంత్రంగా ఉంటుందో, ఏ వస్తువు అయితే బాహ్యావిషయాలతోటి, మనుషులతోటి సంబంధం లేకుండా తనంతట తానుగా నిలబడి ఉంటుందో, అదే చైతన్యవస్తువు. అది ఉండటంవల్లే తెలియబడుతూ ఉంటుంది. దానిని తెలుసుకుంటే నువ్వు సుఖి అవుతావు. అప్పటి వరకూ ప్రతీ జన్మలో ఏదో ఒక దుఖం, వెలితి నిన్ను వెంటాడుతూ ఉంటుంది. అశాంతి, దుఖం నిన్ను విడిచిపెట్టదు. ఇప్పుడు మీకు దుఃఖం లేకపోతే బాగున్నాము అనుకుంటారు. దుఖం వాయిదా పడుతోంది అంతే. అణిగి ఉన్నప్పుడు మీకు లేదు అనిపిస్తుంది, కానీ అది ఉంది.

ఇప్పుడు మానవదేహం వచ్చింది కాబట్టి మీరు పూజలు, జపాలు చేస్తున్నారు. మరల మానవదేహం, ఈ అవకాశం వస్తుంది అని గ్యారంటీ లేదు. ఉన్నన్ని రోజులు జాగ్రత్తగా ఉపయోగించుకోండి. మానవజన్మలో నీకు అవకాశాలు ఉన్నాయి. తెలుసుకోవాలి అనే బుద్ధి నీకు ఇచ్చాడు భగవంతుడు. ఆ బుద్దిని ఉపయోగించుకో అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 11 మార్చి 1996, ఖండవల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవద్గీతలో వాసుదేవస్వామి వారు నాలుగు యోగాల గురించి చెప్పారు. కర్మ యోగం, భక్తి యోగం, ధ్యాన యోగం, జ్ఞాన యోగం. ఒక విషయం మీ అందరి మనస్సులో గాఢంగా నాటుకోవాలి. మీరు ఏమి కంగారు పడకూడదు. సబ్జెక్టు మనకి ఎంత బాగా అవగాహన అయితే మనస్సు అంత తొందరగా చల్లబడుతుంది. ఎంత బాగా చల్లబడిపోతుంది అంటే వైకుంఠానికి వెళ్ళాలనే తలంపు కూడా ఇంక మీకు కలగదు. అందుచేత సబ్జెక్టుని ప్రోపర్‌గా, ఉన్నది ఉన్నట్టుగా అర్థం చేసుకునే శక్తిని ఇమ్మని మనం ఈశ్వరుడిని ప్రార్థించాలి. అలా ప్రార్థిస్తే ఇప్పుడే, ఇక్కడే మనస్సు చల్లబడిపోతుంది. అంటే ఎంత coolness వచ్చేస్తుంది అంటే మీకు, కైలాసాన్ని మర్చిపోతారు, వైకుంఠాన్ని మర్చిపోతారు, మరణం కూడా మర్చిపోతారు, అంత coolness వచ్చేస్తుంది.

ఈ నాలుగు యోగాల లక్ష్యం మనస్సుని బాగుచేసుకోవడానికే, అది మనం మర్చిపోతున్నాం. అవి వేరువేరుగా ఉన్నాయని అలా కంగారు పడకండి. ఈ ధ్యానయోగ లక్ష్యం, జ్ఞానయోగ లక్ష్యం, కర్మయోగ లక్ష్యం, భక్తియోగ లక్ష్యం, అన్నిటి లక్ష్యాలు మనస్సుని సంస్కరింపచేసుకోవటానికి, మన మనస్సుని బాగుచేసుకోవటానికి. అంటే వస్తువును యోగం మనకి పట్టి ఇవ్వక్కర్లేదు, వస్తువు ఆల్రెడీ present, always present, వస్తువు మన హృదయంలో సదా సిద్ధంగా ఉంది, కొత్తగా మనం సంపాదించేది ఏమి లేదు. అది పూర్వజన్మల్లో మన స్వరూపంగానే ఉంది, ఈ జన్మలో కూడా మన స్వరూపంగానే ఉంది, రాబోయే జన్మల్లో కూడా స్వరూపంగానే ఉంటుంది. అయితే ప్రతీజన్మలోను అది స్వరూపంగా ఉన్నప్పటికీ దానికి సంబంధించిన అవగాహన మన మెదడుకి లేదు కాబట్టి అది తెలియబడడం లేదు. వస్తువు మన కూడానే వస్తుంది, వేరుగా రావడం లేదు, స్వరూపంగానే వస్తుంది, మన శరీరం కంటే దగ్గరగా, సన్నిహితంగా ఉంటుంది కానీ దాని గురించి తెలియకపోవటం వలన అది దూరంగా ఉన్నట్టు అనిపిస్తుంది. భగవంతుడు మన స్వరూపంగానే ఉన్నాడు, ఆయన స్వరూపంగా ఉన్నాడు అన్న సంగతి మనకి తెలియకపోవడం వలన ఈ కైలాసానికి ఎప్పుడు వెళ్ళిపోదాం, వైకుంఠానికి ఎప్పుడు వెళ్ళిపోదాం అని అనిపిస్తూ ఉంటుంది. తెలిస్తే మనకి ఏకోరిక రాదు. అది తెలియకపోతే దుఃఖం, తెలిస్తే సుఖం. తెలియకపోతే అశాంతి,

తెలిస్తే శాంతి.  అన్ని యోగాల లక్ష్యం మన ఇంద్రియాలని అదుపు చేసుకోవడం, మన మనసుని అదుపు చేసుకోవడం అన్న సంగతి మనకి తెలియడం లేదు.  యోగం అంటే ఏదో అనుకోకండి.  మన మనస్సుని సంస్కరింపచేసుకోవడం, మన మనస్సుని మనం స్వాధీనం చేసుకోవడం, మనం చెప్పినట్టుగా మన మనస్సు, మన ఇంద్రియాలు వినేటట్టుగా చేసుకోవడం యోగం యొక్క లక్ష్యం.

జపం చేస్తూ ఉంటే జపం సాగడం లేదండి, ధ్యానం చేస్తూ ఉంటే ధ్యానం సాగడం లేదు అని చాలామంది చెబుతారు.  అయితే రాగద్వేషాలు బలంగా ఉన్నప్పుడు, కామక్రోధాలు బలంగా ఉన్నప్పుడు, మన మనస్సులో హెచ్చుతగ్గులు ఎక్కువ ఉన్నప్పుడు ధ్యానం చేద్దామన్నా మనస్సు ధ్యానంలో నిలబడదు.  మనకి శరీరంలో ఎక్కడైనా pain వస్తుంటే, బాధ వస్తుంటే, మనస్సు వెళ్లి అక్కడే కూర్చుంటుంది.  మనం ఎంత ఆపు చేసుకుందాం అన్నా మనస్సు వెళ్లి ఎక్కడ బాధ ఉందో అక్కడికే చేరుతుంది.  మనస్సుని ఎలా నియమించాలి? ఇంద్రియాలని ఎలా నియమించాలి?  తెలియచెప్పడమే యోగం యొక్క లక్ష్యం.  అది నియమించుకున్నాక మన ధ్యానం బాగా సాగుతుంది, శాంతి చెడదు, ధ్యానం కూడా నదీ ప్రవాహం లాగా, తైలధారవలె సాగుతుంది.  మనకు విరళచింతన రాదు, సరళచింతన వస్తుంది.  ఇంద్రియ నిగ్రహం ఉన్న మనస్సుకి ఆ ధ్యాన స్థితి, తైలధారవలె చక్కగా ప్రవహిస్తూ ఉంటుంది.  ఇంద్రియ నిగ్రహం లేకుండా, మనో నిగ్రహం లేకుండా ధ్యానం చేద్దామన్నా ధ్యానం సరిగ్గా కుదరదు.

యోగాన్ని కూడా స్లోగా చేసుకురావాలి కానీ ఒక్కసారే సడన్‌బ్రేక్ వేసినట్టుగా ఉండకూడదు.  స్లోగా, స్టడీగా వెళ్ళమన్నాడు భగవంతుడు వాసుదేవుడు.  ఒక్కసారి మనం సడన్ బ్రేక్ వేస్తే మైండ్ upset అవుతుంది.  నీకు పూర్వజన్మలో వాసనలు బలీయంగా ఉంటే అవి వేగంగా వస్తూ ఉంటాయి.  అంటే మన శరీరం యొక్క వయస్సు 70 సంవత్సరాలు ఉంది కానీ ఆ జన్మాంతరవాసనకు ఎన్ని వేల సంవత్సరాలు ఉంటుందో.  వాసన యొక్క వయస్సు ఎక్కువ, నీ శరీరం యొక్క వయస్సు తక్కువ, సాధన యొక్క వయస్సు తక్కువ. ఆ వాసన యొక్క వేగం అతి బలీయంగా ఉంటుంది, అది వేగంగా వస్తూ ఉంటుంది. దాన్ని స్వాధీనం చేసుకోవడానికి, అదుపులో పెట్టుకోవడానికి యోగం అవసరం.  ఆ యోగం నువ్వు కంగారు పడితే వచ్చేయదు.  నెమ్మదిగా ప్లాన్ చేసుకుని, స్లోగా, స్టడీగా చేసుకుంటూ ఒక నిశ్చయానికి వచ్చి, ఆ నిశ్చయంలో మళ్ళీ wavering లేకుండా, అప్పుడు నువ్వు స్లోగా చేస్తూ ఉంటే, స్టడీగా చేసుకుంటూ వస్తే, నీ మనసు నీకు స్వాధీనంలోకి వస్తుంది, కుదుట

పడుతుంది. నువ్వు ఎప్పుడైతే స్లోగా వర్క్ చేశావో, అప్పుడు నీ మనస్సు నీకు విరోధంగా ఉండదు, నీ మనస్సు నీకు స్నేహితుడు అవుతుంది. బాహ్యంగా ఉన్న స్నేహితులు మనకి ఎంత ఉపకారం చేస్తారో మన మనస్సు కూడా మనకి అంత ఉపకారం చేసి పెడుతుంది ఎప్పుడు అంటే నువ్వు స్లోగా వెళ్తుంటే, స్టడీగా వర్క్ చేస్తుంటే. తొందరపాటు పనికిరాదు, చాపల్యం పనికిరాదు.

వ్యభిచార భక్తి కంటే, అవ్యభిచార భక్తి మంచిది అని కృష్ణుడు గీతలో చెప్పాడు. వ్యభిచార భక్తి అంటే చాపల్యంతో కూడిన భక్తి, అవ్యభిచార భక్తి అంటే చాపల్యం లేని భక్తి, అంటే చపలత్వం లేని భక్తి. అవ్యభిచార భక్తులతో కనుక మనం సహవాసం చేస్తే మనకున్న వ్యభిచార భక్తి అంతా పోతుంది. అది ఇక్కడ సీక్రెట్. వ్యభిచార భక్తి కూడా భక్తే కానీ అవ్యభిచార భక్తులు ఎవరైనా ఉంటే వాళ్ళతో మనం సహవాసం చేస్తే, మనకి అవ్యభిచార భక్తి వచ్చేస్తుంది. మనకి కూడా ఎంతో కొంత భక్తి ఉంది, అసలు లేనివాళ్ళం కాదు. చాపల్యం లేని భక్తి ఎవరికైతే ఉందో వాళ్ళతో మనం సహవాసం చేస్తే, మనకి కూడా చాపల్యంతో కూడిన భక్తి పోతుంది, చాపల్యం లేని భక్తి మనకి వచ్చేస్తుంది. అదే రామకృష్ణ పరమహంస చెప్పాడుగాలి వీస్తుంటే నీకు విసినకర్రతో పనేముంది? ఫ్యాన్‌తో పనేముంది? అదేవిధంగా నీకు అవ్యభిచార భక్తులతో సహవాసం దొరికితే నీకు ఇంక సాధనతో పనేముంది అన్నారు. అంటే వాళ్ళతో సహవాసం దొరకడం కష్టం, ఆ సహవాసాన్ని సంపాదించుకోవాలి. మనం ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకుంటామో, డబ్బుని ఎలా సంపాదిస్తామో అలా వ్యభిచారం లేని భక్తులతో సహవాసం సంపాదించుకోమన్నాడు రామకృష్ణుడు. అంటే చాపల్యం లేని భక్తులతో మనకి సహవాసం ఉంటే సరేసరి, లేకపోతే వాళ్ళతో సహవాసాన్ని సంపాదించుకో మన్నాడు.

మీ మనస్సుకి మూలం మీ హృదయంలోనే ఉంది. మీ మనస్సుని తీసుకెళ్ళి మీ హృదయంలో ఐక్యం చెయ్యడం యోగం యొక్క లక్ష్యం. అయితే ఆ హృదయం ఎంత పవిత్రమైనదో ఈ మనస్సుని కూడా అంత పవిత్రం చేస్తేనే కానీ అది వెళ్లి హృదయంలో నిలబడలేదు. అంటే

**ఎన్ని శాస్త్రాలు చదివినా, దేహము నేను అనే తలంపును విడిచిపెట్టమనే వాటి సారం.**



purification చాలా ముఖ్యం. ఏకాగ్రత, పవిత్రత చాలా ముఖ్యం. స్వామి శివానందగారు ఒక మాట చెబుతూ ఉండేవారు. గాలిలో పక్షి ఎగరటానికి దానికి రెండు రెక్కలు సహాయం ఉండాలి. ఆ రెండు రెక్కలు సహాయం లేకపోతే అది ఎగరలేదు. అలాగే ఆధ్యాత్మిక శిఖరాలను మీరు అందుకోవాలి అంటే పవిత్రత, ఏకాగ్రత అవసరం. నీ హృదయంలో జ్ఞానభాండారం ఉంది, నీ మనస్సుకి ఏకాగ్రత అనే తాళం చెవి సంపాదించు. తాళంచెవి సంపాదిస్తే నీ హృదయంలో ఉన్న పెట్టెలో ఉన్న డబ్బు అంతా నువ్వు లాగేసుకోవచ్చు. నీ హృదయంలో ఇనుపపెట్టి ఉంది, ఆ ఇనుపపెట్టెలో ధనం ఉంది, కానీ నీకు తాళంచెవి దొరకడం లేదు. నీ మనస్సుకి ఏకాగ్రత కుదిరితే, ఆ ఏకాగ్రత అనే తాళంచెవి తోటి నువ్వు ఆ పెట్టెని ఓపెన్ చేసుకోగలవు. అప్పుడు నీకు చాపల్యం ఉండదు, అప్పుడు నీకు going అక్కర్లేదు, coming అక్కర్లేదు. పక్షి రెండు రెక్కలు సహాయంతోగాలిలో ఎంత పైకి అయినా వెళ్ళిపోతుంది, అదేవిధంగా మీరు ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ గురువుని మీరు ఆశ్రయించినా, ఏ మార్గంలో మీరు ప్రయాణం చేసినా, ఈ పవిత్రత, ఏకాగ్రత ఈ రెండింటి వల్ల హృదయం యొక్క లోయలలోకి మీరు ప్రవేశించగలరు. ఒకటి purity, రెండు concentration.

సాధన ఎందుకంటే మనం పవిత్రులం అవ్వడం కోసమే, మనం గుడి చుట్టూరు తిరిగినా లేకపోతే పూజ చేసినా, జపం చేసినా, మనల్ని మనం పవిత్రులను చేసుకోవడం కోసమే. వస్తువుని సంపాదించక్కర్లేదు, వస్తువు మన హృదయంలోనే ఉంది. మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడు ఎంత పరిశుద్ధంగా ఉన్నాడో, ఎంత పరిపూర్ణంగా ఉన్నాడో, ఎంత ఏకంగా ఉన్నాడో, మనం పూజ చేసి, జపం చేసి, మనస్సును అంత పరిశుద్ధంగా చేస్తే మనస్సు హృదయంలో ఐక్యం అవుతుంది. సుందరం అంటే అందం, అళగమ్మ అంటే అందం. రెండు అందాలు కలిస్తే ఎలా ఉంటాయి? అలా మీ హృదయంలో ఎంత అందం ఉందో, మనస్సుకి కూడా అంత సౌందర్యం వస్తే అప్పుడు రెండు అందాలు ఐక్యం అవుతాయి. మీ హృదయంలోని సత్యం వికారంగా లేదు, అది చాలా అందంగా ఉంది. ఆ అందాన్ని చూసిన ఈ కళ్లతో భౌతికమైన సౌందర్యాన్ని ఏమీచూడలేవు. సత్యం వికారంగా ఉండదు, సౌందర్యంగా, సుందరంగా ఉంటుంది. నీ మనస్సు కూడా అంత కళాత్మకంగా ఉంటే, అంత సుందరంగా ఉంటే, అంత సౌందర్యంగా ఉంటే, ఇది వెళ్లి ఆ సౌందర్యంలో ఐక్యం అవుతుంది. అది యోగం యొక్క లక్ష్యం.

నువ్వు భక్తి మార్గంలో ప్రయాణం చేస్తావా, ధ్యాన మార్గంలో ప్రయాణం చేస్తావా, పూర్వజన్మ ప్రవృత్తిని బట్టి, పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి నీకు ఏ మార్గం ఈజీగా ఉందో, సేఫ్‌గా ఉందో ఆ మార్గంలో నువ్వు ప్రయాణం చేసి హృదయంలో ఐక్యం అవ్వు. జ్ఞాన మార్గం, భక్తి మార్గం బయటకి ఈ మార్గాలు అన్నీ వేరుగా కనిపిస్తున్నాయి, కాని గమ్యం ఒక్కటే. అంటే రోడ్లు వేరైనా గమ్యం ఒక్కటే. గోల్ అనేది నువ్వు ముందు కరెక్ట్‌గా నిర్ధారణ చేసుకోవాలి, నిర్ధారణ చేసుకున్నాక ఇంక చాపల్యం వద్దు, ప్రయాణం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యి. ముందు నువ్వు పొందవలసిన వస్తువుని కరెక్ట్‌గా నిర్ధారణ చేసుకో, దానిని పొందడానికి నిర్ధారణ చేసుకున్నాక వెనుకడుగు వెయ్యకు. స్వామీజీ చెబుతూ ఉంటారు go forward, march forward, look forward, no need of looking behind. మళ్ళీ వెనక్కి చూడకు. ఒక నిర్ధారణకి నువ్వురా, ముందు conclusionకి రా, conclusionకి వచ్చిన తరువాత ప్రయాణం ప్రారంభించు, ప్రయాణం ప్రారంభించాక వెనక్కి చూస్తుంటే గోల్‌కి వెళ్ళలేవు. ఒక నిర్ణయానికి వచ్చి నువ్వు ప్రయాణం ప్రారంభించిన తరువాత నీకు అత్యంత సన్నిహితుల పిలుపు వినిపించినప్పటికీ ఇంక నువ్వు వెనక్కి రావద్దు, వస్తే మళ్ళీ పతనం అయ్యిపోతావు. నీకు ఇష్టం లేని వాడు పిలిస్తే ఎలాగూ పలకవు. నీకు అత్యంత ఇష్టమైనవాడు పిలిచినప్పటికీ నువ్వు ఒకసారి ప్రయాణం ప్రారంభించాక వెనక్కి తిరిగి చూడకూడదు.

శరణాగతి మార్గం ఏ గమ్యానికి తీసుకుని వెళ్తుందో, విచారణ మార్గం కూడా ఆ గమ్యానికే తీసుకుని వెళ్తుంది. ఇప్పుడు మనం అందరం మాయలోఉన్నామా? లేదా? ఉన్న దానిని కప్పి ఉంచి, అబద్ధం మాటలు చెప్పేవాడిని ఏమంటారు? మాయ చేస్తున్నాడు అంటారు. మాయ అంటే ఏమి లేదు, కప్పి ఉంచడం. మన హృదయంలో దేవుడు ఉన్నాడు, మన హృదయంలో దేవుడు లేడు అనుకోండి నేను లేను అని చెప్పి ఉండేవాడు వాసుదేవుడు. కృష్ణుడు ఏమన్నాడు అంటే నీ హృదయంలో నేను ఉన్నాను అని చెప్పాడు. అయితే మన హృదయంలో ఉన్న దేవుడు మనకి కనపడుతున్నాడా? కనపడటం లేదు. ఎందుచేత? మన హృదయంలో ఉన్న దేవుడిని మాయ కప్పి ఉంచింది. సాధన యొక్క ప్రయోజనం ఏమిటి అంటే ఆ మాయ అనే తెరని తొలగించడం. సాధన యొక్క గోల్ కూడా అదే. పరమేశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు కానీ మాయ అనేది తెర కింద ఉంది. నీ సాధన యొక్క లక్ష్యం ఏమిటి అంటే ఆ తెరని పక్కకు తొలగిస్తే నీలో ఉన్నటువంటి ఈశ్వరుడు నీకు తెలియబడతాడు. సద్వస్తువు, సత్య వస్తువు, ఆ truthకి సంబంధించిన అంశ నీ

హృదయంలో ఉంది. ఒక్కసారి మాయ అనే తెరను తొలగిస్తే అది తనంతట తానుగా వ్యక్తం అవుతుంది, స్వయంగా ప్రకాశిస్తుంది.

నీ హృదయంలో ఉన్న సద్వస్తువును నువ్వు చూడాలి అంటే సూర్యుడి సహాయం, చంద్రుడి సహాయం, అగ్నిహోత్రుడి సహాయం అక్కర్లేదు. ఎందుచేత? అంటే ఈ పంచభూతాలు, సూర్యుడు, చంద్రుడు, ఈ నవగ్రహాలు, ఇవన్నీ కూడా పరమాత్మ create చేసినవి. అంటే ఇవన్నీ లేనప్పుడు కూడా పరమాత్మ ఉంది. ఈ సృష్టి అంతా కరిగిపోయిన తరువాత కూడా పరమాత్మ ఉంది. నీ లోపల పరమేశ్వరుడు ఉండడం వల్లే వాడు నీకు తెలియబడుతూ ఉంటాడు. వాడే ఈశ్వరుడు, స్వయం ప్రకాశి. అన్ని కాలాల్లో ఉన్నాడు, అంతటా ఉన్నాడు, వాడికి ఏమి పరిమితులు లేవు, హద్దులు లేవు. కానీ వాడు కూడా నేను అంటాడు. కానీ ఆ నేనుకి హద్దులు లేవు, పరిమితులు లేవు. కృష్ణుడు కూడా గీతలో నేను అన్నాడు, ఆ నేనుకి హద్దులు లేవు, పరిమితులు లేవు. కృష్ణుడు కూడా నేను అన్నాడు, అహంభావన కూడా నేను అంటుంది. కృష్ణుడు చెప్పిన నిజమైన నేనుని మనం ఆశ్రయిస్తే, ఆ నిజమైన నేనుకి మనం శరణాగతి పొందితే, అబద్ధమైన నేనుని నాశనం చేసి అది స్థిరంగా ఉంటుంది. అయితే ఇక్కడ కృష్ణుడు ఏమంటున్నాడు అంటే ఒకేసారి నువ్వు కంప్లీట్‌గా సరెండర్ అవ్వలేవు. కొంచెం కొంచెం స్లోగా చేసుకుంటూ వెళ్ళు. స్లోగా వెళితే ముందు పాక్షికంగా శరణాగతి వస్తుంది, పాక్షికమైన శరణాగతి పూర్ణ శరణాగతికి దారి తీస్తుంది. అందుచేత కంగారు పడకు, స్లోగా వెళ్ళు కానీ స్టడీగా వెళ్ళు, వెనక్కి తిరిగి మటుకు చూడకు.

అజ్ఞానం నీకు నేనుగా వ్యక్తం అవుతోంది, అవిద్య నీకు నేనుగా వ్యక్తం అవుతోంది. ఇప్పుడు సూర్యుడు ఉన్నాడు అనుకోండి, మేఘం కమ్మేసింది అనుకోండి మనకి సూర్యుడు ఉన్నా కనపడడు. అదేవిధంగా ఇప్పుడు ఏదైతే నువ్వు నేను, నేను అంటున్నావో, ఆ నేను అనేది మేఘం. ఈ మేఘం నీ లోపల ఉన్న ఆత్మ సూర్యుడిని కనపడకుండా చేస్తుంది. సూర్యుడు కంటే మేఘం గొప్పది కాదు కానీ సూర్యుడు మన కళ్ళకి కనపడకుండా మటుకు మేఘం చెయ్యగలదు. అదేవిధంగా నీ లోపల ఉన్నటువంటి నిజమైన నేను కంటే అబద్ధమైన నేను గొప్పదేమీ కాదు. కానీ అబద్ధమైన నేను నిజమైన నేనుని కనపడకుండా మటుకు చెయ్యగలదు. అజ్ఞానం అనేది ఒక మేఘం, నువ్వు నిజమైన నేనుకి సరెండర్ అయితే ఇది నశిస్తుంది. అంటే నువ్వు నిజమైన నేనుకి ఎప్పుడైతే శరణాగతి పొందావో, ఈ అబద్ధమైన నేనుకి food supply కట్ అయ్యిపోయి అది కృశించి రాలిపోతుంది.

వైకుంఠానికి వెళ్ళిపోదాం, కైలాసానికి వెళ్ళిపోదాం లేకపోతే చచ్చిపోయిన తరువాత స్వర్గలోకానికి వెళ్ళిపోదాం అని అనుకుంటున్నాం కదా, ఇక్కడ బాగా అర్థం చేసుకోండి. ప్రయాణం చేసేది అబద్ధమైన నేను, వైకుంఠానికి వెళ్ళేది అబద్ధమైన నేను, స్వర్గలోకానికి వెళ్ళేది అబద్ధమైన నేను, మళ్ళీ తిరిగి వచ్చి కొత్త దేహాలు తొడిగి కొత్త జన్మలలోకి వచ్చేది అబద్ధమైన నేను, ఆ నిజమైన నేను దగ్గరకి వెళ్ళకుండా ఇది ఏమిచేస్తుంది అంటే వైకుంఠానికి వెళ్ళే పనులు చేసుకోవాలి నీ హృదయంలోకి వెళ్ళద్దు అని చెబుతుంది. ఎందుచేత అంటే ఆ హృదయంలోకి వెళితే అది చచ్చిపోతుంది. వైకుంఠానికి వెళితే అక్కడ అబద్ధమైన నేనుకి మేత దొరుకుతుంది. నిజమైన నేను దగ్గరకి వెళితే దీనికి మేత దొరకదు సరికదా, చచ్చి ఊరుకుంటుంది. బాగా అర్థం చేసుకోండి సబ్జెక్టు. వైకుంఠానికి వెళ్లాలని నిజమైన నేను కోరుకోదు, అబద్ధమైన నేను కోరుకుంటుంది. అంటే ఇప్పుడు మనకి సబ్జెక్టు కనుక ప్రోపర్‌గా అర్థం అయితే, ఇంక వైకుంఠానికి వెళ్ళాలి, కైలాసానికి వెళ్ళాలి అనే desire కూడా arrise కాదు.

వైకుంఠంలో నారాయణుడు ఉన్నాడా? కైలాసంలో శివుడు ఉన్నాడా అని భగవాన్‌ను అడిగారు, ఉన్నాడు అని చెప్పారు. అడిగినవాడు అక్కడ ఊరుకోవచ్చు కదా, వాడు ఎలా ఉంటాడు అని అన్నాడు. అప్పుడు భగవాన్ చెప్పారు ఇక్కడ ఉందండి ఆయన టీచింగ్‌లో ఔన్నత్యం అంతా కూడా, ఉపనిషత్తులలో, వేదాలలో లేని అందాలు. నువ్వు శరీరం లోపల ఎలా ఉంటున్నావో, వైకుంఠంలో కూడా నారాయణుడు అలా ఉన్నాడు. నువ్వు శరీరం లోపల ఎలా ఉన్నావో, కైలాసంలో కూడా శివుడు అలా ఉన్నాడు. అంటే దాని అర్థం ఏమిటంటే, శరీరంలో ఉన్న నేను ఎంత నిజం అనుకుంటున్నావో, వైకుంఠంలో నారాయణుడు అంతే నిజం, కైలాసంలో ఉన్న శివుడు అంతే నిజం కాని, అది కూడా పారమార్థిక సత్యం కాదు అని చెప్పకుండా చెప్పడం. కళ్లు ఉన్నవాళ్ళు అందరూ చూడండి, చెవులు ఉన్న వాళ్ళు అందరూ వినండి. సొంతబుద్ధి ఉన్నవాళ్ళకి సబ్జెక్టు అర్థం అవుతుంది కానీ పరాయి బుద్ధి ఉన్నవాళ్ళకి అర్థం కాదు. కొంతమందికి సొంతబుద్ధి ఉండదు, పుట్టినది మొదలు చచ్చిపోయేవరకు పరాయిబుద్ధి తోటి బ్రతుకుతారు. వాడు ఏమి ఆలోచించుకోలేడు, ఎవడు ఏమి చెబితే అటు గంతులు వేయడమే. వాడికి సొంత బుద్ధి ఉండదు.

ఎప్పుడైతే నువ్వు శరణాగతి పొందుతున్నావో అప్పుడు ఈ మిథ్యానేను నశిస్తూ ఉంటుంది. శరణాగతి పూర్తి అయిపోతే మిథ్యానేను ఇంక తల్లకిందులుగా పడిపోతుంది. ఎప్పుడైతే ఆ మిథ్యానేను తల్లకిందులుగా పడిపోయిందో, జన్మజన్మల నుంచి, లక్షలాది

జన్మల నుంచి ఆ మిథ్యానేనుని అంటిపెట్టుకుని వస్తున్నటువంటి వాసనలు, సంస్కారాలు, తలంపులు, ఆ కుయుక్తులు, కుతంత్రాలు, కుచేష్టలు అన్నీ కూడా రాలిపోతాయి. ఇవన్నీ మిథ్యానేనుని అంటిపెట్టుకుని ఉన్నాయి, ఆ మిథ్యానేను ఎప్పుడైతే పడిపోయిందో, దాని కూడా వస్తున్నటువంటి పరివారం, దాని కూడా వస్తున్నటువంటి సైన్యం, దాని కూడా వస్తున్నటువంటి దుర్వాసనలు అన్నీ కూడా ఒక్కసారి తుడిచి పెట్టబడతాయి. అప్పుడు నువ్వు స్వేచ్ఛ అనుభవించేది, అది స్వతంత్ర్యసుఖం, స్వతంత్ర్యశాంతి. ఈ మిథ్యానేను ఎప్పుడైతే పడిపోయిందో, ఒక్కసారి నువ్వు స్వతంత్రుడవు అయ్యిపోతావు, స్వేచ్ఛను పొందుతావు. అప్పుడు నీ సుఖం కోసం బాహ్యామైన వస్తువుల మీద, బాహ్యామైన పరిస్థితుల మీద, ఈ ప్రారబ్ధం మీద, ఆగామి మీద, సంచితం మీద నువ్వు ఆధారపడి ఉండక్కర్లేదు. అప్పుడు నీ సుఖం స్వతంత్ర్యంగా ఉంటుంది, నీ శాంతి స్వతంత్ర్యంగా ఉంటుంది, dependentగా ఉండదు, independentగా ఉంటుంది, అప్పుడు మాత్రమే నువ్వు స్వతంత్రుడవు అవుతావు, ఆనాటివరకు నువ్వు స్వతంత్రుడవు కాలేవు, ఇష్టాఅయిష్టాలు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేస్తావు, రాగద్వేషాలు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేస్తావు, కామక్రోధాలు ఎటు తిప్పితే అటు తిరుగుతూ ఉంటావు. అప్పటివరకు నువ్వు స్వతంత్రుడవు కానే కావు. ఎప్పుడైతే ఈ మిథ్యానేనుతో ఉన్న పరివారం అంతా నశించి అది అగాథంలో కూలి పడిపోయిందో అప్పుడు మాత్రమే నువ్వు సుఖపడతావు. ఎప్పుడు అంటే మిథ్యానేను పతనం అయ్యిన తరువాత, దాని పరివారం పతనం అయ్యిన తరువాత, అప్పుడు మాత్రమే స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన శాంతి, స్వతంత్రమైన ఆనందం నీకు తెలుస్తుంది. అప్పటివరకు మనం స్వతంత్ర్యంగా ఉండలేము. స్వతంత్ర్యంగా ఉన్నట్టు నటించవచ్చు కానీ మనం స్వతంత్ర్యంగా ఉండలేము.

ఇంతకీ భగవాన్ చెప్పేది ఏమిటంటే, ఈ దేహం ఎవరిది? దేహం మీదే కానీ దేహం మీరు కాదు అంటున్నారు. ఇక్కడ సబ్జెక్టు బాగా అర్థం చేసుకోండి. దేహం ఎవరిది? మీదే. దేహం మీది కాదు అని ఆయన చెప్పడం లేదు, దేహం మటుకు మీరు కాదు. ఆ క్లూ అర్థం చేసుకోండి. దేహమే మీరు అనుకోండి,గాఢనిద్రలో దానితో సెపరేట్ అవ్వడానికి అవకాశం లేదు. ఎప్పుడైతే నువ్వు భగవంతుడికి పూర్ణశరణాగతి పొందావో అప్పుడు నీకు వ్యక్తిభావన ఉండదు, Individual "I" ఉండదు. దేహభావన ఉండదు, బుద్ధి

ఉంటుంది కానీ దేహానికి పరిమితమైన బుద్ధి ఉండదు. ఇక్కడ బాగా అర్థం చేసుకోండి, మీకు వ్యక్తిభావన ఎంతకాలం అయితే ఉంటుందో, అంతకాలం మీకు వైకుంఠానికి వెళ్ళడం తప్పదు, నరకానికి వెళ్ళడం తప్పదు, స్వర్గానికి వెళ్ళడం తప్పదు, తిరిగి పుట్టడం తప్పదు. దీనికి విష్ణుపురాణం చదవక్కరలేదు, శివపురాణం చదవక్కర్లేదు. మీ పుణ్యాన్ని బట్టి, మీరు చేసిన కర్మని బట్టి వైకుంఠానికో, నరకానికో, కైలసానికో వెళ్ళిపోతారు. మళ్ళీ కొత్త శవాలు వస్తాయి. కొత్త శవాలు ఎందుకు అంటే వ్యక్తిభావన మళ్ళీ ఏదో ఒక శరీరం ద్వారా వ్యక్తం అవుతుంది. వ్యక్తిభావన ఎవడికైతే నశించిందో వాడికి వైకుంఠానికి వెళ్లాలని ఉండదు, అంటే ఎందుకు ఉండదో చెప్పమంటారా? ఎవడైతే వైకుంఠానికి వెళదాం అనుకుంటున్నాడో వాడి లోంచి వీడు విడిపోతాడు, అంటే సరెండర్ ఎప్పుడైతే కంప్లీట్ అయ్యిందో, అప్పుడు ఇన్నర్ సర్జరీ జరిగిపోతుంది, అంటే లోపల ఆపరేషన్ జరిగిపోతుంది.

గురువు కూడా సర్జనే, వాడు బయట ఉండడు, లోపల ఉంటాడు. బయట ఉన్న డాక్టర్లు కనిపిస్తున్నారు, గురువు కూడా డాక్టరే. వీడు బయట ఉండడు, లోపల ఉండి సర్జరీ మొదలు పెడతాడు. లోపల నీ బలహీనతలు ఏమిటో చూస్తాడు. నీ బలహీనతలు నీకు తెలియదు. ఈ బలహీనత నీలో ఉంది, ఈ పొరపాటు నీలో ఉంది అని గురువు ఏమి చేస్తాడు అంటే వాటిని కదిపి బ్రెయిన్‌లోకి తీసుకొచ్చి నీకు చూపించి నువ్వు దీనిని eliminate చేసుకోవాలి అని చెబుతాడు. అయ్యో ఈ వాసనలు అన్నీ నేను ఎక్కడ తొలగించుకోగలను అని నువ్వు అంటావు. అప్పుడు గురువు ఏమి చేస్తాడు అంటే నీకు లోపల నుంచి బలాన్ని ఇస్తాడు. ముందు వాసన చూపిస్తాడు, ఈ వాసన నేను తొలగించుకోలేను అంటావు. అప్పుడు నువ్వు కంగారుపడతావు, ఆ వాసన తొలగించుకునే ఎనర్జీ నీకు లోపల నుంచి ఇస్తాడు. ఎనర్జీ ఇచ్చి నీ బలహీనతలు ఏమిటో నీకు చూపించి వాటిని జాగ్రత్తగా eliminate చేస్తాడు, ఏ దేహబుద్ధి మీద అయితే ఇవన్నీ ఆధారపడి ఉన్నాయో, ఆఖరున దానిని కట్ చేస్తాడు. దానిని కట్‌చేసిన మరుక్షణమే నీకు realization వస్తుంది. ఇదంతా ఎవడు చేస్తాడు? గురువే చేస్తూ ఉంటాడు. సర్జరీ చేసేవాడు ఆయనే, తలుపు సందులో పెట్టి నొక్కేవాడు ఆయనే. మీకు అర్థం అవుతోందా? ఇదంతా గురువే చేస్తున్నాడు, గురువు లోపల ఉంటాడు కాబట్టి వాడు చేసే పని మనం గ్రహించలేము. వస్తువు ఎదురుగా ఉన్నప్పటికీ సూక్ష్మబుద్ధి లేనివాడు పట్టుకోలేడు. గురువు ఎక్కడ ఉన్నాడు

అంటే లోపల ఉన్నాడు. సర్జరీ ఎక్కడ చేస్తున్నాడు? లోపల చేస్తున్నాడు. మనకి జన్మ జన్మల నుంచి వచ్చే సంకల్పాలు, ఊహాలు, తలంపులు, సంస్కారాలు, అన్నీ కూడా ఆ మిథ్యానేనుని అంటిపెట్టుకుని ఉన్నాయి. ఆ మిథ్యానేనుకి ముడి ఎక్కడ ఉంది? లోపల ఉంది, బయట లేదు. దానిని లోపల ఉన్న గురువు కట్ చేయగలడు కానీ బయట ఉన్న గురువు కట్ చేయలేడు. ఈ బయట ఉన్న గురువు ఏమి చేస్తాడు అంటే లోపల ఉన్న గురువుకి నిన్ను అప్పజెప్పేసి వాడు పక్కకి తప్పుకుంటాడు. అంటే ఈ నర్సులు, కాంపౌండర్లు సర్జరీ రూములోకి తీసుకుపోయి అక్కడ సర్జన్‌కి అప్పజెప్పేస్తారు. వాడు సరిగ్గా ఎక్కడ కట్ చెయ్యాలో అక్కడ కట్ చేసి పంపేస్తాడు. ఇది గ్రేట్ సర్జరీ. గురువు చేసే సహాయం మీ కళ్లకి అందదు.

భగవాన్ చెప్పారు టేబుల్ ఫ్యాను ఫుల్‌స్పీడ్‌లో తిరుగుతోంది అనుకోండి, దాని రెక్కలు మనకు కనపడవు. మనకి కనపడడం లేదు కాబట్టి దీనికి రెక్కలు లేవు అనుకుంటామా? అలాగే గురువు చేసే సహాయం అంత ఫుల్ స్పీడ్ లో చేస్తూ ఉంటాడు. అందుచేత మీ కళ్లకి కనపడదు, మీ బుద్ధికి అది అందదు. నిజమైన గురువు ఏమి చేస్తాడు అంటే అతను చేసే సహాయం మనకి తెలియాలి అనుకోడు. ఎందుచేత అంటే అక్కడ personal "I" లేదు. మనం ఎవరికైనా సహాయం చేశాం అనుకోండి, మనం సహాయం చేసినట్టుగా వారికి తెలియాలి అని మనం అనుకుంటాం. కానీ గురువు మటుకు అలా అనుకోడు. ఇతరులకు తెలియాలి అనుకునేవాడు అక్కడ లేడు. అహంభావన ఏమి చేస్తుంది అంటే దేవుడు చెప్పినట్టు మనం వినడం కంటే ఈ అహంభావన చెప్పినట్టు దేవుడు వింటే బాగుంటుంది అంటుంది. దేవుడు అంటే ఒక మొద్దు అబ్బాయి కాదు. Supreme power, higher power, universal consciousness. ఈ ప్రపంచం అంతా తెగిపోయిన గాలిపటంలా లేదు. ఎవడైతే నిన్ను సృష్టించాడో వాడే ఈ ప్రపంచాన్ని కూడా సృష్టించాడు. నిన్ను సృష్టించినవాడు వేరు, ప్రపంచాన్ని సృష్టించినవాడు వేరు కాదు. వాడు వేరు, వీడు వేరు కాదు. ఆ higher power కంట్రోల్‌లో నువ్వు ఉన్నావు. కానీ అహంభావన తోటి వీడు



**నది వెళ్లి సముద్రంలో ఎలా కలుస్తుందో అలా నామభావన, రూపభావన లేనివాడు చైతన్యంలో ఐక్యమైపోతాడు.**

ఏమనుకుంటాడు అంటే ఆ డివైన్ ఎనర్జీ, ఆ భగవంతుడు నేను చెప్పినట్టు వినాలి అనుకుంటాడు. అహంభావన యొక్క ప్రకోపం, దాని వేగం అంత బలంగా ఉంటుంది.

ఈ ప్రశ్నించేవాడు ఏమని అడుగుతున్నాడు అంటే మీరు ఏదో చెప్పుకుపోతున్నారు, ఏమి లేదు అంటున్నాడు, అసలు ఈ సబ్జెక్టు వినేటప్పటికే మేము చాలా పూజలు చేసేశాం, పుణ్యాలు చేసేశాం, మా పుణ్యాలు మాట ఏమిటి అంటున్నారు. ఇంతకీ ఇప్పటికే ధ్యానాలు, వ్రతాలు, యజ్ఞాలు, యాగాలు చేసేసి ఉన్నాం, మరి ఏదో కోరికతోటే చేశాం కదా ఇవన్నీ, ఒక్కసారి అన్నీ తలకిందులుగా ఆధారాలు లేకుండా ఊడగొట్టి పడేస్తున్నారు. ఎక్కడ కూర్చుందాం అంటే అక్కడ ఆధారాలు లేకుండా చేసేస్తున్నారు మీరు, ఇప్పటివరకు మేము పుణ్యాలు, ఉదాత్తమైన కార్యాలు, దానాలు, ధర్మాలు అన్నీ చేసేసి ఉన్నాం. మరి మాకు ఇంక ఏమి ఫలితం లేదా అంటున్నారు. మరి మా మాట ఏమిటి? ఇప్పటికే మేము చెయ్యవలసిన ఘనకార్యాలు అన్నీ కూడా అయ్యిపోయాయి. ఫలితం అనుభవించడానికి మేము రెడీగా ఉన్నాం. తీరా మీరు మా నోటి దగ్గరకు వచ్చింది రాలగొట్టేస్తున్నారు. పని చేసేశాం, ఫలం రెడీగా ఉంది, ఆ టైములో మీరు మా ఆధారాలు అన్నీ ఊడగొడుతున్నారు. మరి మేము చేసిన మంచి పనులకి ఫలితం లేదా?

మీరు చెప్పింది చూస్తే మా ఆధారాలు అన్నీ ఊడగొట్టేస్తున్నారు, మా supportలు అన్నీ కింద నుంచి లాగేస్తున్నారు అని ప్రశ్నించేవాడు అడుగుతున్నాడు. అప్పుడు భగవాన్ ఏమంటున్నారు అంటే, నువ్వు అనుభవించడానికి రెడీగా ఉన్నాను, అనుభవిస్తాను అంటున్నావు కదా, అదంతా నిజమే, ఎలా నిజం అంటే, ఇక్కడ మనం కూర్చుని ఎలా మాట్లాడు కుంటున్నామో అలా నిజం, అవి నీకు అనుభవానికి వస్తాయి, నువ్వు చెప్పే కర్మ ఫలితం నీకు వస్తుంది, ఆ కర్మఫలితం కూడా పారమార్థిక సత్యం కాదు. అది final truth కాదు, ఇక్కడ కూర్చొని మనం ఎలా మాట్లాడుకుంటున్నామో, రోజూ అన్నం ఎలా తింటున్నామో, అలా వ్యవహారిక సత్యంగా అనుభవాలు అన్నీ నీకు వస్తాయి. నీకు ఫలం వస్తుంది, ఆ ఫలం నిజం అని చెప్పడం లేదు, ఇప్పుడు మనం ఎలా కూర్చున్నామో, ఈ existence ఎలాగో, దేహం లోపల నేను ఉన్నాను అని ఎలా అనుకుంటున్నావో, బయట ప్రపంచం ఉందని ఎలా అనుకుంటున్నావో అలాగే నిజం. అలాగే నీకు ఆ ఫలితం అనుభవంలోకి వస్తుంది. చేసేవాడు దేహంతోటి తాదాత్మ్యం పొందే చేశాడు, అనుభవించేవాడు ఆ దేహం

తోటి తాదాత్మ్యం పొందే అనుభవిస్తాడు, కంగారుపడకు. నీ అనుభవం నీకు వస్తుంది, నీ ఫలం నీకు వస్తుంది. నీ పుణ్యం నీకే వస్తుంది ఇంకొకడికి వెళ్ళిపోదు. నీ కరెక్ట్ అడ్రస్ ఈశ్వరుడికి తెలుసు, నువ్వేమి కంగారు పడకు.

నువ్వు చేసిన పనులు అన్నిటికి ఫలితంగా వైకుంఠం వెళ్లాలని నువ్వు అనుకుంటున్నావు అనుకో, కర్మసిద్ధాంతం ప్రకారం నువ్వు చేసిన పనులకి వైకుంఠానికి వెళతావు, కాదు అనడం లేదు But, ఈ But అన్నచోటే కొంప తీసేస్తూ ఉంటుంది. ఎవడైతే ఫలితం అనుభవించాలి, ఫలితం అనుభవించాలి అనుకుంటున్నాడో వాడిని enquiry చెయ్యి, వాడిని బోను ఎక్కించు. ఫలితం వస్తుంది, రాదని చెప్పడానికి నేను ఎవరని? అది వస్తుంది, అది చట్టం. But ఎవడైతే ఫలితం కోసం ఎదురు చూస్తున్నాడో వాడిని బోనులో పెట్టు. రవ్వంత, ముల్లంత కొంచెం వాడిని విచారణ చెయ్యి. విచారణ చేస్తే, అప్పుడు ఏమవుతుంది అంటే, వాడు ఎవడో వాడికి తెలియబడతాడు. వాడు ఎవడో వాడికి తెలియబడగానే ఉన్న సత్యం వాడికి ఎరుకపడుతుంది. వాడి మూలం వాడు తెలుసుకోగానే ఉన్న సత్యం వాడికి ఎరుక పడుతుంది. ఎప్పుడైతే నీ మూలం నీకు తెలిసిందో, అప్పుడు వైకుంఠం గురించి కానీ, కైలాసం గురించి కానీ, స్వర్గం గురించి కానీ ఆలోచించేవాడు నీకు వెతికినా కనపడడు. ఏమి wonderful teaching చూడండి. ఇంతవరకు వైకుంఠానికి వెళ్ళిపోదాం అనుకున్న వాడు వాడి మూలం తెలుసుకున్నాక వాడు ఇంక కనపడడు, నువ్వు వెతికినా కనపడడు వాడు. ఎందుచేత? వాడు ఆ ఫైనల్ truthలో కలిసిపోయాడు. ఎంత బ్యూటిఫుల్ టీచింగ్ చూడండి. ఇదంతా మీకోసం చెప్పడం లేదు. ఎందుకు చెబుతున్నాను అంటే నాకు పాయసం నోట్లో పోసుకున్నట్టు ఉంటుంది కాబట్టి నేను చెబుతున్నాను, నా satisfaction కోసం నేను చెబుతున్నాను కానీ మిమ్మల్ని ఉద్ధరించడానికి నేను ఏమి చెప్పడం లేదు, నాకోసం నేను చెప్పుకుంటున్నాను. నేను ఎంజాయ్ చేస్తున్నాను సబ్జెక్టుని, అందుకు నేను చెప్పుకుంటున్నాను కానీ మిమ్మల్ని ఏదో uplift చెయ్యడానికి నేను చెప్పడం లేదు.

భగవాన్‌కి కేన్సర్ వచ్చింది. ఇదేమి పురాణం కాదు. ఇది ప్రాక్టికల్‌గా జరిగింది. కేన్సర్‌కి ఇప్పుడున్న వైద్యం అప్పుడు లేదు. డాక్టర్స్ చూశారు, మేము చేసే వైద్యం అయ్యిపోయింది. ఇది మా వల్ల అవ్వదు అన్నారు. భగవాన్ ఎక్కడున్నాడో మీకు చూపించటం కోసం ఇది చెబుతున్నాను. మీ కాలాన్ని పాడుచేయడం కోసం చెప్పడం లేదు. ఆయన

ఎక్కడున్నాడో చూపించటం కోసం చెబుతున్నాను. మేము వైద్యం చెయ్యవలసింది చేసాము, ఇంక మా పని పూర్తి అయ్యిపోయింది, దీనికి ఇంక ప్రత్యేకంగా మందులు లేవు. ఈ కేన్సర్ తగ్గిపోవాలి అని ఒకసారి మీరు సంకల్పించుకోండి, ఇంక అంతకంటే మాకు మార్గం కనపడడం లేదు అని భగవాన్‌తో అన్నారు. వాళ్ళు చెప్పింది అంతా భగవాన్ విన్నారు. మీరు చెప్పేది ఏమిటి ఈ కురుపు తగ్గిపోవాలి అని నన్ను అనుకోమంటున్నారు. ఈ కురుపు తగ్గిపోవాలి అని అనుకునేవాడు ఒకడు లోపల ఉంటే మీ సలహా లేకుండానే అనుకుంటాడు. మీరు సలహా చెప్పక్కర్లేదు. ఈ కురుపు తగ్గిపోవాలి అనుకునేవాడు లోపల ఒకడు ఉంటే, మీ సలహా లేకుండానే వాడు అనుకుంటాడు. అలా అనుకునేవాడు ఇక్కడ లేడు. ఒకవేళ అనుకునేవాడు అక్కడ ఉన్నాడు అనుకోండి, మీ సలహా లేకుండానే అనుకుంటాడు అన్నారు. అదీ భగవాన్ అంటే.

Last days లో భక్తులు భగవాన్‌తో మీరు వెళ్ళిపోతున్నారు అంటే అప్పుడు భగవాన్ అన్నారు I am not going away, I am here where can I go? అన్నారు. నేను ఎక్కడికీ వెళ్ళిపోవడం లేదు. వెళ్లిపోవాలి అంటే ఎక్కడైనా చోటు ఉండాలి కదా, లేని చోటు ఎక్కడ ఉంది? I am not going away, I am here. నన్ను వెళ్ళిపోమంటున్నారు, నేను లేని చోటు ఉంటే ఎక్కడికైనా వెళ్ళగలను, ఉన్నది ఒక్కటే వస్తువు, అది అంతటా ఉంది, అంతటా ఉన్న వస్తువుకి going లేదు, coming లేదు. అంతటా ఉన్న వస్తువుకి రాక లేదు, పోక లేదు. Coming, going ఇవన్నీ కూడా జీవుడు యొక్క లక్షణాలు.

ఇంతకీ వీడు ఏమంటున్నాడు అంటే నేను పుణ్యాలు చేసేసి రెడీగా ఉన్నాను, పోనీ స్వర్గలోకం, నరకలోకం మాట అటు ఉంచండి. మళ్ళీ ఏదో కొత్త శరీరం వస్తుంది. అంటే పునర్జన్మ వచ్చేస్తుంది. నేను చేసిన పుణ్యానికి హయ్యర్ బర్త్ వస్తుంది అనుకుంటున్నాను. ఇంతకంటే మంచి శరీరం, ఇంతకంటే మంచి కుటుంబం అంటే మనం చేసిన పుణ్యం ఫలితంలోకి వచ్చేస్తుంది కదా, అదంతా enjoymentకి బాగుంటుంది అనుకుంటున్నాను. కాని మీరు చెప్పింది అంతా విన్నాక నాకు rebirth లోంచి escape అవ్వాలనే బుద్ధి కలుగుతోంది. అంటే పునర్జన్మలోంచి తప్పించుకోవాలని బుద్ధి ఇప్పుడు నాకు కలుగుతోంది సబ్జెక్టు విన్నాక. సబ్జెక్టు మీరు చెప్పింది బాగా శ్రవణం చేశాక, పునర్జన్మ రాకూడదు అని కోరుకుంటున్నాను, దాని కోసం ప్రయత్నం చెయ్యాలి అనిపిస్తోంది. ఇప్పటివరకు మంచో, చెడ్డో ఒక ప్రవాహంలో

వచ్చేశాను, ఇప్పుడు ఈ ప్రవాహం లోంచి ఒడ్డుకి వచ్చేయాలనే ప్రయత్నంలో నేను ఉన్నాను. ఇప్పుడు ప్రయత్నం చేస్తాను. ఇప్పటికే వయసు చాలా వచ్చేసింది, లేట్ అయిపోయింది. ఏదో rebirth వస్తుంది, ఎంజాయ్ చేద్దాం అనుకొన్నాను. ఇప్పుడైనా rebirthలోంచి బయటపడడానికి అవకాశం ఉందా? ఇప్పుడైనా నేను విడుదల పొందడానికి ప్రయత్నం చేస్తాను. ప్రయత్నం చెయ్యకూడదా? చేస్తే నేను సక్సెస్ అవ్వగలనా? అని భగవాన్‌ని అడుగుతున్నాడు.

భగవాన్ దగ్గరకి వచ్చి ఎవరైనా కొంతమంది ఏమనేవారు అంటే ఏవండీ మేము పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకున్నాం అనేవారు. భగవాన్ ఏమనేవారు అంటే నీకు పిల్లలు పుట్టకుండా నువ్వు ఆపరేషన్ చేయించుకున్నావు బాగానే ఉంది. నువ్వు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకో, నీకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నావు కానీ నువ్వు తిరిగి పుట్టకుండా ఉండడం కోసం ఆపరేషన్ ఏమి చేయించుకోలేదు. ముందు ఆ సర్జరీ ఏదో తిప్పలు పడు అన్నారు. ఇక్కడ అడిగేవాడు ఆ సర్జరీ అడుగుతున్నాడు. వీడు ఏమి అడుగుతున్నాడు అంటే మిగతా గొడవ వదిలేయండి, పునర్జన్మకి వెళ్ళకుండా నేను ఉండిపోవాలి. ఇంత సబ్జెక్టు విన్నాక మళ్ళీ rebirth నేను కోరుకోవడం లేదు. శరీరం వచ్చింది అనుకోండి, శరీరం వచ్చాక రోగం వస్తుంది, ముసలితనం వస్తుంది. ఆ కొత్త శరీరానికి కూడా మళ్ళీ చావు వస్తుంది. శరీరం వస్తే ఇంద్రియాలు వస్తాయి, ఇంద్రియాలు వస్తే సంసారం వస్తుంది, ఇంక ఇంట్లో వాళ్ళు అందరూ పట్టుకుని తిడుతూ ఉంటారు. మీకు అర్థం అవుతోందా? శరీరం వచ్చాక ఇవన్నీ వచ్చేస్తాయి. ఈ గొడవ అంతా ఎందుకు లెండి అంతా విన్నాను కదా సబ్జెక్టు, ఇందులోంచి బయటకి వచ్చేయడానికి ప్రయత్నం చేస్తున్నాను. Rebirthలోంచి బయటకి రావడానికి ఉపాయం చెప్పండి. భగవాన్ ఏమంటున్నారు అంటే నువ్వు అడిగిన ప్రశ్న రైటే, ఇప్పుడు దారికి వస్తున్నావు నువ్వు, సబ్జెక్టు నీకు అవగాహన అవుతున్నట్టు తెలుస్తోంది. ఇదివరకు కర్మ ఫలం అనుభవించాలి, నేను చేసిన పుణ్యం ఏమయ్యిపోతుంది అని కంగారు పడ్డావు. ఇప్పుడు నువ్వు దారిలోకి వచ్చేశావు. నీ thinking ఇప్పుడు ప్రోపర్‌గా ఉంది. వాడు వేసిన ప్రశ్న కరెక్ట్‌గా ఉంది కాబట్టి ఆ ప్రశ్నని భగవాన్ Encourage చేస్తున్నారు.

కొంతమంది మాష్టార్లు స్కూలులో ఏమి చేస్తారు అంటే స్టూడెంట్ ఏదైనా ప్రశ్న

అడిగాడు అనుకోండి, కూర్చో, కూర్చో అంటారు. అలా వాడిని కూర్చో అంటే సిగ్గుపడతాడు. వాడిని కూర్చోమనకూడదు ఆ ప్రశ్నకి ప్రోపర్‌గా వీళ్ళు రిప్లై ఇవ్వాలి. కూర్చో కూర్చో అంటే రెండో ప్రశ్న వెయ్యడానికి వాడు ఇష్టపడడు. తెలియనివాడు అలా తెలియనట్టు ఉండిపోతాడు. భగవాన్ ఈ ప్రశ్న వేసిన వాడిని discourage చెయ్యడం లేదు, Encourage చేస్తున్నారు. నీ ప్రశ్న ప్రోపర్‌గా ఉంది, బాగుంది. ప్రశ్న వెయ్యడానికి కూడా కొంత అవగాహన ఉండాలి. భగవాన్ ఏమి చెబుతున్నారు? నువ్వు అడిగిన ప్రశ్న చాలా బాగా ఉంది. Find out who is born, తిరిగి పుడతాడు పుడతాడు అంటున్నావు కదా, ఆ పుట్టేవాడు ఎవడు? ఇప్పుడు పుట్టినవాడు ఎవడు? నేను బాధపడిపోతున్నాను, ఇబ్బంది పడిపోతున్నాను అనుకుంటావు కదా నువ్వు, ఆ ఇబ్బంది పడేవాడు ఎవడు? ఆ బాధపడేవాడు ఎవడు? నాకు పునర్జన్మ రాకుండా చూడండి అని నువ్వు అంటున్నావు, బానే అంటున్నావు. రాత్రి నువ్వు నిద్రపోతావు కదా, ఆ నిద్రలో నాకు పునర్జన్మ రాకుండా చూసుకో అని అనేవాడు లోపల ఎవడైనా ఉన్నాడా? అక్కడ ఈ గొడవ లేదు, మెలకువగా ఉన్నప్పుడే గొడవ అంతా వస్తోంది అంటున్నాడు. అలా సోర్సులోకి మోసుకుని పోతున్నారు. ఇప్పుడు నువ్వు ఏమంటున్నావు? పునర్జన్మ లేకుండా నన్ను తప్పించమంటున్నావు. గాఢనిద్రలో ఉండగా, నీ పూర్వజన్మ గొడవ కానీ, రాబోయే జన్మ గొడవ కానీ నీకు ఏమైనా ఉందా? అని అడుగుతున్నారు భగవాన్. మళ్ళీ తిరిగి నేను పుట్టకూడదు అని నువ్వు అంటున్నావు. తిరిగి నేను పుట్టకూడదు అనేవాడు ఎవడైనాగాఢనిద్రలో ఉన్నాడా?

మీరు ఏమి కంగారు పడకండి పూర్వజన్మల గొడవలు అన్నీ ఎక్కడ ఉన్నాయి? మన మనసులో ఉన్నాయి. రాబోయే జన్మల గొడవలు అన్నీ ఎక్కడ ఉన్నాయి? మన మనసులో ఉన్నాయి. పుణ్యాలు ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. పాపాలు ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. రాబోయే జన్మలు వెయ్యి వస్తాయి అనుకోండి, వెయ్యి జన్మలకి సరిపడా విత్తనాలు ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. నీకుగాఢనిద్రలో మనసు లేదు, మనసు లేకపోతే నీకు దేహం గొడవ లేదు, దేవుడు గొడవ లేదు, లోకం గొడవ లేదు, పూర్వజన్మల గొడవ లేదు, రాబోయే జన్మల గొడవ లేదు, వైకుంఠాలు లేవు, కైలాసాలు లేవు, స్వర్గం లేదు, నరకం లేదు, సడన్‌గా అక్కడ ఆపుచేసి మళ్ళించి తీసుకుని పోతున్నాడు. హృదయం యొక్క లోతుల్లోకి, ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో, అక్కడకి తీసుకుని

పోతున్నాడు. నువ్వుగాఢనిద్రలో ఉండగా నీ పునర్జన్మలు గురించి, రాబోయే జన్మల గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నావా? ఆలోచించవు. ఎందుచేత? అక్కడ మనస్సు లేదు. నిద్రలో మనస్సు లేదు, మెలకువలో మనస్సు ఉంది. రాబోయే జన్మలు ఎక్కడ ఉన్నాయి? మనస్సులో ఉన్నాయి. అందుచేత మనస్సు ఉన్నప్పుడు నువ్వు రాబోయే జన్మల గురించి ఆలోచిస్తావు. మనస్సు లేనప్పుడు గాఢనిద్రలో కూడా నువ్వు ఉన్నావు కానీ అక్కడ నీకు దేహం గొడవ లేదు, మైండ్ గొడవ లేదు, World గొడవ లేదు, god గొడవ కూడా లేదు. నీ రాముడు, నీ కృష్ణుడు, నీ శివుడు, నీ కాశీ, నీ రామేశ్వరం, నీ అరుణాచలం, ఈ గొడవ అక్కడ లేదు. Godless, bodyless, mindless, Worldless, ఫైనల్ స్టేట్‌కి తీసుకుని పోతున్నారు మధ్యవర్తుల గొడవ, ఈ అడ్డదారుల గొడవ వద్దని. ఫైనల్ స్టేట్, సుప్రీం స్టేట్. ఇంక సుప్రీంకోర్టు జడ్జిమెంటును ఎవడు ప్రశ్నించడానికి వీలు లేదు. అక్కడకు తీసుకుని పోతున్నాడు. అక్కడ నువ్వు ఉన్నావు, అక్కడ దేహం లేదు, అక్కడ లోకం లేదు, అక్కడ దేవుడు లేడు. నీకు ఏ గొడవ అక్కడ లేదు కానీ నువ్వు అక్కడ ఉన్నావు. నీ రాబోయే జన్మల గురించి ఆలోచించేవాడు అక్కడ లేడు కానీ నువ్వు అక్కడ ఉన్నావు.

ఎవడైతే గాఢనిద్రలో ఉన్నాడో, వాడు మెలకువలో కూడా ఉన్నాడు. వాడు మెలకువలో ఉన్నప్పటికీ నీకు కనపడకుండా నీ మైండ్ చేస్తుంది. ఆ మైండ్‌ని చింపేయటమే సాధన యొక్క ప్రయోజనం. గాఢనిద్రలో ఎవడైతే ఉన్నాడో వాడు ఇప్పుడు మెలకువలో కూడా ఉన్నాడు. వాడు నిన్ను విడిచిపెట్టి ఎక్కడకి పారిపోలేదు. నిద్రలో ఎంత సహజంగా ఉన్నాడో, మెలకువలో కూడా అంత సహజంగానే ఉన్నాడు. అంత సహజంగా ఉన్న వస్తువు నీకు వ్యక్తం కాకుండా, నీ మనసు కప్పేస్తోంది. దానిని తీసేసుకో నీకు నిజం ఇప్పుడే, ఇక్కడే వ్యక్తం అవుతుంది. నీ కాళ్ళు కదపక్కర్లేదు, నీ చేతులు కదపక్కర్లేదు, నీ తల తిప్పక్కర్లేదు, ఇప్పుడే, ఇక్కడే, here and now, సూర్యుడు ఉదయించిన తరువాత గంటకి వెలుగు రాదు, సూర్యుడు ఉదయించడం, వెలుగు రావడం ఒకేసారి జరిగిపోతుంది. అలా నీ మనసుని ఎప్పుడైతే చింపేశావో, చింపేసిన మరుక్షణంలో ఈ లోపల ఉన్న నిజం తానుగా వ్యక్తం అవుతుంది. రాబోయే జన్మల మాట వదిలేయ్, ఫలానా శరీరంలో నేను ఉన్నాను, ఇప్పుడు నేను ఖండవల్లిలో ఉన్నాను అన్న సంగతి కూడా నీకు తెలియదు. ఇది మైండ్ క్రియేషనే, నేను ఫలానా శరీరంలో ఖండవల్లిలో ఉన్నాను అనేది కూడా మైండ్ క్రియేషనే. రాబోయే జన్మలు

కూడా మైండ్ క్రియేషనే. ఇది ఎంత అసత్యమో అది కూడా అంత అసత్యం. అంటే ఏమిటి నువ్వు మంచి జన్మలు కోరుకుంటున్నావు అనుకో, ఒక గోతిలోంచి బయటకి వచ్చాం బాగానే ఉంది మళ్ళీ ఇంకొక గోతిలో పడడం లాంటిది. మంచి జన్మ వచ్చాక శరీరం వస్తుంది. ఆ శరీరం ఎంతకాలం ఉంటుంది? 70 ఏళ్ళో, 80 ఏళ్ళో ఉంటుంది, ఈ లోకంలో అటు ఇటు తిరుగాడుతుంది. ఏదో ఒక రోజున చచ్చిపోతుంది. ఇవన్నీ కాలక్షేపానికి చెబుతున్నాను అనుకోకండి, మనం ఇక్కడ కూర్చున్న మాట అసత్యం కానీ నేను చెప్పిన మాటలు మటుకు అసత్యం కాదు. మనం కూర్చొని మాట్లాడుకుంటున్నాం, ఇది అసత్యం అంటే అంగీకరిస్తాను. కానీ అది మటుకు అసత్యం కాదు. ఎక్కడ నుంచి అయితే నేను ఉదయించి వస్తుందో దాని పరిష్కారం కూడా అక్కడే ఉంది. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుంచి ఉదయించి వస్తుందో దాని సమాధానం కూడా అక్కడే ఉంది. అంటే దాని అర్థం ఏమిటి? నేను అనే తలంపు ఎక్కడ నుంచి అయితే ఉదయించి వస్తుందో, దాని సోర్స్ నువ్వు చూడగలిగితే ఇది అక్కడే అణిగిపోయి, ఇది అక్కడే కాలిపోయి బూడిద అవుతుంది.

రమణమహర్షిగారు చెబుతూ ఉంటారు ఓ అరుణాచలేశ్వరుడా! ఈ భౌతికమైన దేహాన్ని స్మశానానికి తీసుకెళ్ళి పుల్లలకి కానీ, పిడకలకి కానీ ఆహుతి చెయ్యకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి ఈ జీవలక్షణాలని కాల్చి బూడిద చెయ్యవయ్యా, ఈ మిథ్యానేను ఎక్కడ ఉదయిస్తుందో దాని పరిష్కారం కూడా అక్కడే ఉంది. భగవంతుడు ఏమని చెప్పాడు? నీ హృదయంలో నేను ఉన్నాను అని చెప్పాడు. నీ మూలం ఎక్కడ ఉంది? నీ హృదయంలో ఉంది. నీ మెలకువలో అంటే జాగ్రదావస్థలో, భగవంతుడు ఏ మూలంలో ఉన్నాడో ఆ మూలాన్ని నువ్వు తెలుసుకోగలిగితే, నీకు అసలు birth లేదు, rebirth లేదు, present tense లేదు, past tense లేదు, Trouble లేదు, unhappiness లేదు, హెచ్చుతగ్గులు లేవు, disappointments లేవు, జరిగినదంతా ఒక కల కింద నీకు కరిగిపోతుంది. నీ పూర్వజన్మలు అన్నీ కూడా కల కింద కరిగిపోతాయి. ఈ పుట్టింది, చచ్చింది నేను కాదన్న సంగతి నీకు తెలుస్తుంది. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు ఎప్పుడైతే తెలిసిందో, ఎప్పుడైతే ఎరుక

**నీ మనస్సుని నువ్వు మచ్చిక చేసుకుంటే నీకు సహనం వస్తుంది. సహనం వున్నవాడు మాత్రమే హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళగలడు.**



పడిందో, రాబోయే జన్మల గొడవ ఉండదు, పూర్వజన్మల గొడవ ఉండదు, రాబోయే జన్మలు, పూర్వజన్మలు కేవలం స్వప్న సమానం అన్న సంగతి నీకు తెలిసిపోతుంది. అసలు unhappiness లేదు, difficulties లేవు, disappointments లేవు, ఏమి లేదు ఇదంతా స్వప్నం అన్న సంగతి నీకు అనుభవంలోకి వస్తుంది. ఇంతవరకు చాలా కష్టపడిపోయాం అని మీరు అనుకుంటున్నారు అనుకోండి. మీకు సత్యానుభవం వచ్చేసింది అనుకోండి ఇదివరకు ఉన్న కష్టం అంతా కల కింద మీకు తెలుస్తూ ఉంటుంది. అయ్యో నేను ఎంతో కష్టపడి పోయాను అని ఇంతకాలం అనుకున్నాను, అసలు కష్టపడింది ఏమి లేదు అన్న సంగతి తెలుస్తుంది. Realization వచ్చాక, నేను కష్టపడుతున్నాను అనుకునే వాడికి చావు వచ్చేస్తుంది.

భగవాన్ ఏమంటారు అంటే నీకు సత్యానుభవం కలిగినప్పుడు అంతా ఆనందమే. God is bliss అనడం లేదు, లేకపోతే ఆత్మ is bliss అనడం లేదు, All is bliss. ఏమి చెబుతున్నారు ఇక్కడ సబ్జెక్టు. అంతా ఆనందమే. నీ లోపల ఉన్నటువంటి సత్యవస్తువుని తెలుసుకున్నాక అంతా ఆనందమే. దేవుడిలో ఆనందం ఉంది అనడం లేదు. ఆత్మలో ఆనందం ఉంది అనడం లేదు. All is bliss అంటే అంతా ఆనందమే. ఒక్క దేవుడినే కాదు, ప్రపంచాన్ని కూడా వాడు ఆనందంగానే అనుభవిస్తాడు. All is bliss. ఎంతవరకు నోటి తోటి చెప్పగలడో అంతవరకు తీసుకుని పోతున్నాడు. మీరు ప్రపంచంలో ఉన్నారు అనుకోండి, ఇంకా మీరు చచ్చిపోలేదు కదా, అందరూ బ్రతికి ఉన్నారు కదా, అలా బ్రతికి ఉండగా మీకు సడన్‌గా జ్ఞానం వచ్చేసింది అనుకోండి, అప్పుడు కూడా మీకు ప్రపంచం కనిపిస్తుంది కదా, అది మీకేమి Trouble ఇవ్వదు. అప్పుడు ప్రపంచాన్ని కూడా మీరు ఆనందంగా అనుభవిస్తారు. అది మిమ్మల్ని ఏమి చిరాకు పెట్టదు, మీకు ఏమి Trouble ఇవ్వదు, మీకేమి difficulty ఇవ్వదు, మీకేమి disappointment తీసుకురాదు. దేవుడిని సరేసరి, ప్రపంచాన్ని కూడా, సృష్టిని కూడా నువ్వు ఆనందంగానే అనుభవిస్తావు. దేవుడే ఆనందం అనుకోకు, ప్రపంచం కూడా నీకు ఆనందమే. ఎప్పుడు? ఆ realization నీకు కలిగాక. God is bliss, World is bliss, self is bliss, all is bliss. శరీరం ఉండగా నీకు జ్ఞానం వచ్చేసినా శరీరం ఎక్కడకు పోతుంది? ప్రపంచం ఎక్కడకు పోతుంది? శరీరం ఉంటుంది, ప్రపంచం ఉంటుంది. కాని అంతా bliss ఇక మీకు. World కూడా మీకు World లాగా కనపడదు, ఎలా కనిపిస్తుంది? Blissగానే మీరు దానిని అనుభవిస్తూ ఉంటారు, అంతా ఆనందమే.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**అసక్తిరన భిష్వంగః పుత్రదార గృహాదిషు ।**

**నిత్యం చ సమచిత్తత్వమ్ ఇష్టానిష్టోపపత్తిషు ॥ 13-09 ॥**

**తాత్పర్యము :** భార్య, పుత్రులు, ఇల్లు సంపదలు మున్నగువానియందు మమతాసక్తులు లేకుండుట, ఇష్టానిష్ట సంప్రాప్తి వలన ఎట్టి మనోవికారములకు లోనుగాకుండుట, ఎల్లప్పుడును సమభావముతో నుండుట.

**అసక్తిరనభిష్వంగః -** భార్య, పిల్లలు, ఇల్లు, వీటిమీద అభిమానం పెట్టుకోకు. అభిమానం అంటే అర్థం ఏమిటంటే, మీఇంట్లో ఎవరికైనా రోగం వచ్చింది అనుకోండి, ఆ రోగం నాకే వచ్చేసింది అనుకుంటే నువ్వు ఆధ్యాత్మికంగా వికాసం పొందలేవు. నీ భార్యకి వచ్చిన రోగం, నీ బిడ్డకి వచ్చిన రోగం, లేకపోతే మీ ఇంట్లో ఎవరికో వచ్చిన రోగానికి నువ్వు వైద్యం చేయించవచ్చు, కానీ అభిమానం పెట్టుకోకు. ఆ రోగం నాకే వచ్చేసింది అనే బాధ కనుక నీకు ఉంటే, నీకు అటాచ్మెంట్ ఎక్కువ ఉందని అర్థం. ఇంక నువ్వు ఆధ్యాత్మిక జీవితానికి పనికిరావు అనిమోహమాటం లేకుండా చెప్పేస్తున్నాడు భగవంతుడు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే, చెయ్యవలసిన డ్యూటీ చెయ్యి. అంతేకానీ నేనే చచ్చిపోయాను అని


అభిమానం పెట్టుకుని, ఒళ్ళు మర్చిపోయి, ఇల్లు మర్చిపోయి అదే లోకంగా విలపించవద్దు. ఆ రకంగా ఉంటే ఆధ్యాత్మిక జీవితానికి పనికిరావు.

**పుత్రధార గృహాదిషు –** పుత్రుడు, భార్య, గృహం, వీటిపట్ల మనం చెయ్యవలసిన డ్యూటీ చెయ్యవచ్చు కానీ వాళ్లకి వచ్చిన బాధ కానీ, కష్టం కానీ నాకే వచ్చేసింది అనుకోకు. డ్యూటీ చెయ్యి, ఆసక్తి పెట్టుకోకు. భగవంతుడు నీ శరీరం ద్వారా, ఉపాధి ద్వారా ఏ పని అయితే నీకు నియమించాడో ఆ పని చేసి వదిలేస్తూ ఉండు. నువ్వు పనిని విడిచి పెట్టక్కర్లేదు. దానికి సంబంధించిన ఫలాసక్తిని నువ్వు విడిచిపెట్టు. ఆసక్తి లేకుండా నువ్వు జీవిస్తే వచ్చే ఫలం ఎలాగూ వస్తుంది, నీకు అలసట ఉండదు.

**నిత్యం చ సమచిత్తత్వం –** శరీరం వచ్చిన తరువాత, దేహం ప్రారబ్ధాన్ని బట్టి కొంతకాలం మీకు సుఖం ఉండవచ్చు, కొంతకాలం కష్టం ఉండవచ్చు. సుఖం తరువాత కష్టం వస్తుంది, కష్టం తరువాత సుఖం వస్తుంది. తల్లి కడుపులోంచి బయటకి వచ్చిన తరువాత స్మశానానికి వెళ్ళేవరకు సమానంగా ఎవరికీ రోజులు వెళ్ళవు. జీవితంలో అప్స్ డౌన్స్ ఉంటాయి. అప్స్ వచ్చినప్పుడు సంతోషంగా, డౌన్స్ వచ్చినప్పుడు దుఃఖంగా ఉంటుంది. నీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి గౌరవాలువచ్చినా, అవమానాలు వచ్చినా, నీ మనసుని సమానంగా పెట్టుకో. నీ మనసులో ఉన్న శాంతిని పోగొట్టుకోవద్దు. నీ దేహం ఎంత నిజమో, నీకు వచ్చే గౌరవం అవమానం కూడా అంతే నిజం.

గౌతమబుద్ధుడు ఏమన్నాడు అంటే ఎప్పుడూ నాతో ఉండే నాదేహమే నాది కానప్పుడు నా దేహానికి బయట ఉన్న వ్యక్తులు, వస్తువులు, గొడవలు, నావి ఎలా అవుతాయి? రమణమహర్షి గారు చెప్పేవారు. అరుణాచలం వచ్చిన కొత్తలో ఆకలి బాధ, ఇప్పుడు ఆశ్రమం పెట్టాక అజీర్తి బాధ. దేహ ప్రారబ్ధం అది. అప్పుడు రాళ్ల మీద కూర్చోవలసి వచ్చింది, ఇప్పుడు సోఫా మీద కూర్చోవలసి వచ్చింది. అదీ నిజం కాదు, ఇదీ నిజం కాదు. రెండూ స్వప్నమే.

రమణమహర్షిగారు 1896 వ సంవత్సరం సెప్టెంబరు ఒకటవ తేదీన అరుణాచలం వచ్చిన రోజున, ఓ అరుణాచలేశ్వరుడా, ఓ తండ్రీ, నువ్వు రమ్మంటే నేను వచ్చాను. నా అంతట నేను రాలేదు. ఈ దేహం ద్వారా ఏ పని చేసుకోవాలి అనుకుంటున్నావో అది చేసుకో అన్నాడు, అంతేకానీ నాకు జ్ఞానాన్ని ప్రసాదించు, భక్తిని ప్రసాదించు, అని అడగలేదు. అదీ శరణాగతి అంటే, శరణాగతికి మించిన ప్రార్థన లేదు.



పౌర్ణమి సందర్భంగా అరుణాచల దీపం

శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు

# సద్గురుని స్వరూపమే అనుగ్రహం

"ఇది తప్పనీ, అది ఒప్పనీ దేనినీ ఎవరినీ విమర్శించవద్దు. విమర్శల వల్ల ఎవ్వరూ బాగుపడరు, నీవు గాఢనిద్రలో ఉన్నప్పుడు తప్పు ఒప్పు తెలుస్తున్నాయా? అందుచేత మెలకువలో నిద్రపోవడం అభ్యాసం చెయ్యి, అనగా నీవు ఆత్మలో నిలకడ చెందు" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. పరిసరాలను విస్మరించి నీవు ఆత్మ నిష్ఠుడవు కావాలి ముందు నీవు సత్ప్రవర్తన కలిగి యుండి మౌనముగా ఉండి మనస్సును అంతర్ముఖం చేస్తే, నీ ఇచ్ఛాశక్తి వృద్ధి నొంది ప్రపంచం భగవంతుని రాజ్యంగా విలసిల్లుతుంది. అట్టి భగవంతుని రాజ్యం నీలోనే, నీ స్వరూపంగానే ఉంది. హృదయంలో అంతర్యామిగా ఉన్న ఆత్మయే భగవంతుడు. అట్టి ఆత్మయే అన్ని విధముల శక్తులుగా వ్యక్తమవుతోంది. ఉన్నది కేవలము ఆత్మ ఒక్కటే, అదే సర్వాధిష్టానం. ఈ పరమసత్యం అనుభవంలో లేని కారణము చేత ఇది భౌతిక ప్రపంచమని, మరొకటి ఆధ్యాత్మిక ప్రపంచమని భావించడం జరుగుతుంది. మనిషి తాను బలహీనంగా ఉన్నప్పుడు సంఘానికి ఏమి మేలు చేయగలడు? సంఘానికి మేలు చేయాలంటే శక్తిని సంపాదించాలి, అందుకు ముందుగా వాస్తవంగా తానెవరో తెలుసుకోవాలి. తన్ను తాను తెలుసుకొనే ప్రయత్నంలో గుర్వనుగ్రహమే కీలకం. అనుగ్రహం అనేది గురువు (లేదా) పరమాత్మకు పర్యాయపదం. సూర్యుడు అంటే కేవలం వెలుగు మాత్రమే, సూర్యుని దృష్టిలో చీకటి లేనే లేదు, అయినప్పటికీ మనము సూర్యోదయంతో చీకటి పోయిందని అనుకుంటాం. సూర్యుని వెలుతురు మాదిరిగా గుర్వనుగ్రహం నిరంతరం ఉండేదే అని గ్రహించాలి. మన చుట్టూ సూర్యుని కాంతి నిండి ఉన్నా, సూర్యుని చూడడానికి మన ముఖం సూర్యునివైపుకు త్రిప్పాలి. అదేవిధముగా అనుగ్రహం ఇప్పుడే, ఇక్కడే అంతటా నిండి వున్నా దానిని అనుభవించడానికి మనస్సును అంతర్ముఖం చేసి మనోమూలం వైపు దృష్టి సారించాలి. భగవంతుని స్వరూపమే అనుగ్రహం. మనిషి పరమాత్మకు శరణాగతి చెందితేనే తప్ప, కేవలం అంతటా ఉన్నదే భగవదనుగ్రహం అన్న సత్యము అనుభవంలోకి రాదు. దేనినీ ఇది మంచి అనిగాని, ఇది చెడు అనిగాని, ఇది సఫలము అనిగాని, ఇది విఫలము అనిగాని ఎంచకూడదు. మన సద్గతికీ, దుర్గతికీ కారణం మనస్సే. శరీరము, జీవత్మము, సంసారము, పుట్టుక, మరణము మున్నగునవన్నీ భ్రాంతి కల్పితములే. సకల సాధనల లక్ష్యమూ మనోనాశమే. మనస్సు నశిస్తే, స్వరూప సచ్చిదానంద స్థితి తానుగా అనుభవైకవేద్యం అవుతుంది. మట్టియందు కల్పితమైన ఘట నామ, రూపములు తొలగగానే మట్టియే మిగులునట్లు, మనస్సు నశిస్తే తానే బ్రహ్మము.

**(ఓం తత్ సత్)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**